జగనన్నతోనే పేదల సంక్షేమం

• ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం సొరకాయల పేట, ఎద్దులపల్లిలో సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, పుంజా నగేష్‌యాదవ్, రామిరెడ్డి, చుక్కలూరు దిలీప్‌రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి చుక్కలూరు రామచంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. స్థానికులు సీసీరోడ్లు, డ్రైనేజీలు, పింఛన్లు, హౌసింగ్, కరెంట్ స్తంభాల తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సొరకాయలపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న బోయ సుంకన్నకువైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు.


ఎద్దులపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రామరాజ్యం తలపిస్తోంది

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్న సీఎం జగన్ పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికలు దగ్గరపడినప్పుడల్లా మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నిండాముంచే ఆల్‌ఫ్రీ బాబు,, ఆయన ప్యాకేజీ దత్తపుత్రుడు, జనసేన నేత పవన్ కళ్యాణ్ సినీ డైలాగులను నమ్మేంత అమాయకులు రాష్ట్ర ప్రజలు కాదన్నారు. సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధించిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి,ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, సచివాలయాల రూరల్ కన్వీనర్ ఎం కుమార్‌రెడ్డి, నాయకులు జోజోడే కుమార్, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, సీ అబ్దుల్‌రజాక్, లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, నీలం సాయినాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటిని కాచి వడబోసి తాగండి


నీటి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

గుంతకల్లుటౌన్: పట్టణానికి సరఫరా చేస్తున్న మంచినీటిని కాచి చల్లార్చి వడబోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. పట్టణంలోని పలు ఏరియాల్లో రంగు మారిన నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదు అందిన నేపథ్యంలో శనివారం కర్నూలు నుంచి రీజినల్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీకి సంబంధించి ట్రేసర్లు నీటి నమూనాలు సేకరించారు. ఎస్ఎస్ ట్యాంకులతో పాటు పట్టణంలోని పలు ఏరియాల్లో సరఫరా అయిన నీటిని పరిశీలించారు. నీటి విషయంలో ఎలాంటి భయాందోళనలు అక్కర్లేదని, కాచి వడబోసి తాగాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మైదానంలో శనివారం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే టోర్నీలో అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 26 టీమ్‌లు పాల్గొననున్నాయి. విజేతలకు వరుసగా రూ.9 వేలు, 6 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు ఎంహెచ్ లక్ష్మినారాయణరెడ్డి, దత్తు, బాబా, పెన్నయ్య, మున్నా, పీడీ నరేష్, పీసీ దాదాఖలందర్, క్రీడాకారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై టయోటా షోరూం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. ముసుల్ అనే వ్యక్తి బైక్‌పై అనంతపురం వెళ్తుండగా టయోటా షోరూం సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో అనంతపురము ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి


తీవ్రంగా గాయపడిన మెహరాజ్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో స్థల వివాదంలో శనివారం ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాల్లోకి వెళితే.. గుత్తి ఆర్ఎస్‌లోని పద్మనాభయ్య ఫ్యాక్టరీ సమీపంలో నివాసముండే మెహరాజ్, తరుణ్ కుటుంబాలకు మధ్య కొంతకాలంగా స్థల వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం మెహరాజ్, తరుణ్ కుటుంబ సభ్యులు పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఇరు వర్గాలకు సర్దిజెప్పి పంపారు. అయితే పోలీసుస్టేషన్ నుంచి మెహరాజ్ బయటకు వచ్చిన వెంటనే అతనిపై తరుణ్ కుటుంబ సభ్యులు దాడి చేశారు. దాడిలో మెహరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ స్తంభాలు తొలగించండి


సీసీరోడ్డు మధ్యలో ఇనుప విద్యుత్ స్తంభం

యాడికి: సీసీరోడ్డుపై ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలని ఎంపీటీసీలు అవుకు నాగరాజు, కోటి వెంకటరాముడు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద , కెనరా బ్యాంకు వెనుక భాగాన ఇనుప విద్యుత్ స్తంభాలతో రోడ్డుకు అడ్డంగా ఉన్నాయన్నారు. బ్యాంకుకు వచ్చే ప్రజలతో పాటు గుత్తి, తాడిపత్రికి పోయే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మూడు నెలల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

ఆర్యవైశ్య సంఘం సేవలు అభినందనీయం

తాడిపత్రి: ఆర్యవైశ్య సంఘం సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయమని డీఎస్పీ సిఎం.గంగయ్య అన్నారు. శనివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులతో ఉచిత మెగా గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ నిర్వాహకులను అభినందించారు. ఇటీవల అనంతపురంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ భార్య అనిత చికిత్స కోసం ఆర్యవైశ్య సంఘం సభ్యులు రూ.21,000 నగదు డీఎస్పీకి అందజేశారు. శిబిరంలో దాదాపు 150 మందికి ఈసీజీ, 2 డీఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్రనాథ్, జయవరం అశ్వర్థ రంగయ్య, వంకదారి రాజా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


డీఎస్పీ గంగయ్యకు నగదు అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్‌లోనే రక్తదానం చేయండి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు పట్టణం, చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన రక్తదాతలు ప్రభుత్వాస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేసి అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారిని ఆదుకోవాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ కోరారు. రక్తం వ్యాపారాన్ని అరికట్టేందుకు భారత రాజ్యాంగ అవగాహన వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో శనివారం ప్రభుత్వాస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన చెప్పారు. రక్తదానం చేసిన 12 మంది దాతలను అవగాహన వేదిక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యాంగ అవగాహన వేదిక మహిళా అధ్యక్షురాలు జింకల సరస్వతి, సభ్యులు వేణుగోపాల్, షహనాబీ, రాజేశ్వరి, మాబుబీ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతను అభినందిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

నెట్టికంటుడి సన్నిధిలో పుట్టపర్తి ఎమ్మెల్యే


ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి స్వామి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి తీర్థ ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం

గుత్తి: జక్కలచెరువులోని గొందిపల్లి ఆంజనేయ స్వామి మాన్యం(ఇనాం) భూములు ఆలయానికే చెల్లుతాయని హైకోర్టు తీర్పు రావడంతో అర్చకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. జక్కలచెరువు గ్రామంలో గొందిపల్లి ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 317లో 21.17 ఎకరాలు, సర్వే నంబర్ 322లో 15.38 ఎకరాలు ఇనాం భూములు ఉన్నాయి. కొంత కాలంగా భూముల విషయంలో వివాదం నెలకొనడంతో అర్చకులు హైకోర్టును ఆశ్రయించారు. భూములు ఆంజనేయస్వామి ఆలయానికి చెందినవని హైకోర్టు ప్రకటించింది. ఈ మేరకు శనివారం అర్చకులకు హైకోర్టు ఆర్డర్ కాపీ అందడంతో సీఐ వెంకటరామిరెడ్డికి అందజేశారు. హైకోర్టు తీర్పుపై అర్చకులు రవికుమార్, నవీన్ కుమార్, లిఖిల్ వర్మ, ఉదయ్ కుమార్, చేతన్ వర్మ, బొలికొండ రంగనాయకులు, రవి, లక్ష్మీకాంతమ్మ, విష్ణువర్ధన్, సూరిలు హర్షం వ్యక్తం చేశారు.

మస్తానయ్య ఉరుసు ప్రారంభం


మస్తానయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్

గుంతకల్లు: మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న పాతగుంతకల్లులోని హజరత్ సయ్యద్‌షా అలీ అక్బర్ ఉరుఫ్ హజరత్ మస్తాన్‌వలి ఉరుసు శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. వక్ఫ్‌బోర్డు అధికారులు, దర్గా ధర్మకర్తలు, ముస్లిం మతపెద్దలు, దర్గా ముతవల్లి నేతృత్వంలో స్వామి సమాధిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రార్థనలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వేలాది మంది భక్తుల నడుమ గంధం ఉత్సవం నిర్వహిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ ప్రత్యేక ప్రార్థనలు

అనంతపురం జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ శనివారం రాత్రి మస్తానయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజ్వాన్‌కు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖాజా మస్తాన్, ఈఓ మన్సూర్, దర్గా కమిటీ సభ్యులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా నిర్వాహకులు ఆయనకు గంధం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి నూర్‌మహమ్మద్, సహాయ కార్యదర్శి ఖాజా, సభ్యుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

'నా మట్టి-నా దేశం' ఏర్పాట్ల పరిశీలన

గుంతకల్లుటౌన్: అంజలినగర్ పార్క్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న నా మట్టి–నా దేశం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం ఉదయం అంజలినగర్ పార్క్‌ను కమిషనర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. వార్డు ఇన్‌చార్జ్ మస్తాన్, డీఈ రామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈలు శ్రీకాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కమిషనర్ పాతగుంతకల్లులోని హజరత్ మస్తాన్‌వలి ఉరుసు సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గుత్తి: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఎస్ డిగ్రీ కాలేజీ సీనియర్ ఎకనామిక్స్ లెక్చరర్ జయరంగారెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం కార్యదర్శి వెంకట్ నాయక్, సహాయ కార్యదర్శి లక్ష్మీప్రసాద్, ఏఐఎస్ఎఫ్ చరిత్ర, విద్యార్థులకు కొరకు చేసిన పోరాటాలను వివరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సీఐ హమీద్‌ఖాన్

తాడిపత్రి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ పేర్కొన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన బాలికల క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల కోసం ఆర్డీటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన బాలికలకు బహుమతులను అందజేశారు. పోటీల్లో 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు ఈనెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారని ఆర్డీటీ ఏటీఎల్ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధరణీబాబు, ఎంఈఓ నాగరాజు, ఎస్టీఎల్ సావిత్రి, కోచ్‌లు ఓబులేసు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి: స్థానిక చిన్న విఠోబ ఆలయంలో శనివారం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన బృందం సంకీర్తనల నడుమ ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం గావించారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణయ్య, భజన మండలి సభ్యులు టీటీ నాగభూషణరావు, టీకే జగదీష్, బీ రవి తదితరులు పాల్గొన్నారు.


రుక్మిణీ పాండురంగస్వామి ప్రాకారోత్సవ దృశ్యం

వందశాతం వ్యాక్సినేషన్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా గర్భిణులు, చిన్నారులకు వంద శాతం వ్యాక్సినేషన్(వ్యాధి నిరోధక టీకాలు) పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి షమీన్‌తాజ్ పేర్కొన్నారు. శనివారం యర్రగుంట్ల సబ్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇంద్రధనుస్సు కార్యక్రమం ద్వారా గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందించే ప్రక్రియ, రికార్డులు పరిశీలించారు. అనివార్య కారణాలతో వ్యాధినిరోధక టీకాలు వేసుకోని 13 మంది గర్భిణులు, 69 చిన్నారులకు ఇంద్రధనుస్సు కార్యక్రమం ద్వారా వ్యాధినిరోధక టీకాలు వేశామన్నారు. రెండో విడత ఇంద్రధనుస్సు కార్యక్రమం సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు ఉంటుందన్నారు. ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొ న్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ షమీన్‌తాజ్

వర్షం కోసం జలాభిషేకం



గుత్తి: పట్టణంలోని కోట వీధి(నేసే వీధి)లో వెలిసిన ఆంజనేయస్వామి దేవాలయంలో వర్షం కోసం ఆంజనేయస్వామికి జలాభిషేకం చేశారు. మహిళలు 108 బిందెలతో స్వామికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఆంజనేయస్వామికి జలాభిషేకం చేయడం వల్ల వర్షాలు పడతాయన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 32వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన నరసింహులు అంత్యక్రియలకు శనివారం వార్డు కౌన్సిలర్ వై.సుధాకర్ రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని అతని కుటుంబసభ్యులకు కౌన్సిలర్ హామీ ఇచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు : క్రిష్టిపాడు సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు యాడికి రూరల్ సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

ఇగుడూరులో చోరీ

తాడిపత్రి: మండలంలోని ఇగుడూరులో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన శ్రీరాములు, భార్య రామలక్ష్మి శుక్రవారం రాత్రి భోజనం ముగించుకుని ఇంటి వసారాలో నిద్రపోయారు. శనివారం తెల్లవారుజాము 5 గంటలకు నిద్రలేచిన రామలక్ష్మి ఇంట్లోకి వెళ్లి చూడగా గవాక్షం నుంచి కింద పడి ఉన్న మట్టిని గమనించి భర్తను నిద్రలేపింది. ఆయన ఇంటి పైకి ఎక్కి చూడగా గవాక్షం కడ్డీలు తొలగించి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన రూ.2 లక్షలు, 15 గ్రాముల బంగారు చెంపసరాలు, జుంకీలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాన్ని తాడిపత్రి రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

17న మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు

తాడిపత్రి: ఓ వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమె వద్దనున్నటువంటి బంగారు చైన్‌ను తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై అర్బన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన వివరాలు.. చంద్రగిరి శిరీష పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముండేది. భర్త పెద్దిరాజు భార్య శిరీషను వదిలేయడంతో తన రెండేళ్ల కూతురితో శిరీష ఒంటరిగా ఉంటోంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన బండారు రామపుల్లయ్య అనే వ్యక్తి ఒంటిరిగా ఉన్న శిరీషతో పరిచయం ఏర్పరుచుకుని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమె వద్దనున్నటువంటి రెండున్నర తులాల బంగారు గొలుసు తీసుకున్నాడు. తనను పెళ్లి చేసుకోమని శిరీష బండారు రామపుల్లయ్యను పదేపదే అడుగగా మొహం చాటేసేవాడు. శనివారం తనను వివాహం చేసుకోవాలని లేనిపక్షంలో తన వద్ద నుంచి తీసుకున్న బంగారు గొలుసును తిరిగిచ్చేయాలని శిరీష పట్టుబట్టడడంతో తాను పెళ్లి చేసుకునేది లేదని బంగారు గొలుసు తిరిగివ్వనని తెగేసి చెప్పడంతో శిరీష అర్బన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రామపుల్లయ్యపై 420 కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

కుర్చీల వితరణ

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కేశవరెడ్డి పాఠశాలకు రూ.10 వేల విలువైన కుర్చీలను వితరణ చేశాడు. హెచ్ఎం వసుంధర, ఉపాధ్యాయులు కేశవరెడ్డిని అభినందించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

గుంతకల్లు రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం, నాటుసారాను శనివారం సాయంత్రం సెబ్ సీఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. పట్టణంలోని ఒన్‌టౌన్, టూటౌన్, వజ్రకరూరు పోలీస్ స్టేషన్, సెబ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాదాపు 57 కేసుల్లో 996 లీటర్ల కర్ణాటక మద్యం, 420 లీటర్ల నాటుసారా పట్టుబడింది. శనివారం సాయంత్రం తిమ్మాపురం వద్దనున్న జాతీయ రహదారిపై మద్యం , నాటుసారా ధ్వంసం చేశారు. సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, సెబ్ సీఐ మహేష్ కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తిలో..

గుత్తి: గుత్తి, పెద్దవడుగూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 5,088 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, 78 మద్యం బాటిళ్లతోపాటు 5 లీటర్ల నాటుసారాను శనివారం కర్నూలు రోడ్డులో ధ్వంసం చేశారు. సెబ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి


మట్లగొందిలో సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి


పెద్దవడుగూరు : మాట్లాడుతున్న తహసీల్దార్ నాగభూషణ

శింగనమల: నియోజకవర్గంలో ఓటరు ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి బీఎల్వోలకు సూచించారు. శనివారం సోదనపల్లి, మట్లగొంది, సలకంచెర్వులలో బీఎల్వోల ఇంటింటి సర్వేను పరిశీలించారు. సర్వే త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కొత్త ఓటర్లను నమోదు చేయించాలని, మృతి చెందిన వారి పేర్లను తొలగించాలన్నారు. ఆమె వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, బీఎల్వోలు ఉన్నారు.

పెద్దవడుగూరు : తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలని తహసీల్దార్ నాగభూషణ లు పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటరు సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓటు సవరణ సమయంలో సరైన వివరాలు తీసుకోవాలని సూచించారు. ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

యాడికి: ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఓటరు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వీరన్నపల్లె, కోనుప్పలపాడు, నిట్టూరు, యాడికి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లు, ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదు, బదిలీ, తొలగింపుపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, ఆర్ఐ ఆనందబాబు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా ప్రతి గడపకూ వెళ్లి ఓటరు జాబితా సర్వే చేయాలని తహసీల్దార్ లక్ష్మానాయక్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన తబ్జూల, చాగల్లు తదితర ప్రాంతాల్లో సర్వేను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే పూర్తి చేయాలని బీఎల్‌ఓలకు వివరించారు.

పుట్లూరు: తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని కడవకల్లు, సూరేపల్లి, అరకటివేముల తదితర గ్రామాల్లో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులపై ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ పుట్లూరు, చింతకుంట తదితర గ్రామాల్లో ఓటరు సర్వేను పరిశీలించారు.

రేపు షాపుల వేలం

శింగనమల: శివపురం పెద్దమ్మ దేవాలయం వద్ద చిల్లర సరుకులు, సప్లయర్స్ షాపులకు సోమవారం వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈఓ శోభ తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామస్తుల సమక్షంలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846